# విమాన ప్రయాణం

**- రాధ కాశీనాధుని**

నమస్తే! వెల్కం అంటూ ఎయిర్ హోస్టస్ నవ్వుతూ దణ్ణాలు పెట్టేస్తుండగా విమానం మీద అడుగుపెట్టేను. భుజాన వేలాడుతూ చంకలో ఇరుక్కున్న హాండ్ బాగు చంటివాడిని, రెండో చేత్తో లాక్కొస్తున్న కారీ ఆన్ సూట్ కేసు ఎడపిల్లాడిని గుర్తు చేస్తుండగా సీటు నంబరు వెతుకుతూ ముందుకి కదిలా... పది, ఇరవై, ముప్ఫై సంఖ్యల్లో ఉన్న సీట్లు దాటి వెడుతున్న నన్ను మధ్యలో ఆపేసి, నాచేతిలో ఉన్న బోర్డింగు పాసుని నేన్నివ్వకపోయినా పుచ్చేసుకుని "ఇంకొంచం ముదుకెళితే మీసీటు అందో ఎయిరు హోస్టస్. ఆవిడగారి తెలివితేటలకి నవ్వాలో ఏడవాలో తెలియక నోరు తెరిచి ఏదో అనబోయిన నాకు "ఇదిగో నువ్వు ఆ అమ్మాయికి లెక్చెర్లివక, ఏదో ట్రెయినింగు మాన్యుయల్ లో ఉన్న పాయింటులన్నీ తు చ తప్పక పాటించేస్తోంది పాపం" అని మావారు ఆనవాయితిగా ఇచ్చే వార్నింగు చెవుల్లో రింగుమటుండగా... నిన్ను క్షమిచేసేను సుమా.. అన్న తీరులో చిరునావ్వొకటి పారేసి ముందుకి నడిచాను.

పిల్లా పాపలు లేకపోయినా నూవర్క్ లో విమానం ఎక్కి, యూరపులోనూ, బొంబాయిలోనూ మారి హైదరాబాదు లో దిగడం అనేది, అక్కడ మనం చూడబోయే తెలుగుసినిమా కథ కంటే కాస్త కాంప్లికేటెడే మరి. మామూలుగా ప్రతి ప్రయాణాన్నీ ఒక సాహసయాత్ర గా ఊహించేసుకుని, గమ్యం చేరుకునే లోపున జరుగుతాయేమో అని అనుమానం కలిగిన సంఘటనలనీ, దొర్లబోయే పొరబాట్లనీ, తటస్థపడబోయే చెన్న సైజు విలన్లనీ, పెద్ద సైజు హీరోలమనుకునే సహృదయులనీ, మహాఆత్మీయతతో "ఎన్నెన్నో జన్మలబంధం" అన్న పల్లవి నేపథ్యంలో వినబడుతోందేమో అని అనుమానం వచ్చేట్లు మాటాడే ఆత్మబంధువులనీ, తలుచుకుని నడుంబిగించి ఏది ఏమైనా నేను అన్నింటికీ తయార్ అనుకుంటాను. కానీ ఈ మారు మాత్రం నా అనుభవాల పేజీల్లో ఎప్పుడూ కనబడని కొత్త కథ, నాజ్ఞాపకాల పుటల్లో పట్టుబడని బొమ్మ నాకు తటస్థపడ్డాయి.

నాసీటునంబరు కనబడగానే చేతిలోని బాగుని సీట్లో ఉంచి, కారీ ఆన్ ని ఓవర్ హెడ్ కంపార్టుమెంటులో పెట్టే ప్రయత్నానికి ఉపక్రమించా ... ఈలోపున "excuse me I am supposed to sit next to Aparna" అన్న మాటలు విని ఎవరీ శాల్తీ అని పరకాయించి చూసిన నాకు కిటికీ పక్క కూర్చున్న చిన్న కుర్రాడొకడు కనబడ్డాడు. "నీపక్కనెవరుకూర్చోవాలో నాకు తెలియదు కాని ఈ సీటు నాదేనోయ్" అంటూ నాపెట్టె పైకి ఎక్కించి హాండుబాగుని కాళ్ళదగ్గరుంచుకుని సీట్లో కూలబడ్డాను. ఈ కుర్రాడిమూలంగా ఇంకా స్పేపట్లో సీటు మార్చాల్సిన అగత్యం కలుగు తుందేమో అన్న అనుమానం మాత్రం మనసులో మెదిలింది. సీటు బెల్టు వగైరాలు పట్టుకున్నాక ఆ కుర్రాడికేసి పరకాయించి చూసేను. కోల మొహం చక్కటి కళ్ళు, ముద్దొచ్చే చిన్న నోరు, ఒత్తైన జుత్తు, చామన చాయకంటె ఒక రంగు ఎక్కువులో ఉండి, పొద్దుటి మంచులో తడిసిన పువ్వులా ఉన్నఆ అబ్బాయి మొహం మీద నుంచి చూపు తప్పించుకో లేక పోయాను. ఇంకా సిద్ధం కాని ఎంటర్ టైన్ మెంటు స్క్రీన్ ని నొక్కేస్తూ, హెడ్ ఫోన్స్ చెవుల మీద పెట్టేసుకుంటూ హడావుడి పడుతున్నాడు.

"నీ పేరేవిటి?" అని అడిగేను. ఆరామ్ అని చెప్పేడు. "మరి నీతో ఎవరొస్తున్నారు?" అన్నా " నాంతట నేనే వెళుతున్నాను" అన్న జవాబు విని "ఆ" అంటూ నోరు తెరిచి ఆశ్చర్య పడబోయి, వీడేదో కలగాపులగంగా మాటాడేస్తున్నాడు, బహుశా వాళ్ళవాళ్ళందరికీ ఒక చోట సీట్లు దొరికి ఉండవని నాకు నేనే నచ్చచెప్పేసుకున్నాను. ఇక కొద్ది సేపట్లో వాళ్ళొచ్చి బహుశా బాత్రూము పక్కనున్న తమ సీట్లోకి నన్ను మారమని అడగటం మాత్రం ఖాయం అనుకున్నాను. మరి అలా ఆడిగినప్పుడు మంచిదానిలా నటించి లోలోపల తిట్టుకుంటూ సీటుమారాలా? లేకపోతే నేను మారను అని చెప్పాలా? అని బుర్ర లో లెక్క కడుతుండగా నా మోచేతిని తడుతూ "How do you start this?" అని నన్ను అడుగుతూ టచ్ స్క్రీన్ ని వేలితో కొడుతున్నాడు . అది విమానం కదిల్తే గాని మొదలవ్వదు అని అంటూండగా ఎవరో ఒక యువకుడొచ్చి "హాయ్ ఆరామ్" అన్నాడు. ఫరవాలేదు ఒక శాల్తీయే వచ్చేడు. మా పక్క ఖాళీ ఉన్న సీట్లో కూర్చుంటాడు, నాకు సీటు కదలాల్సిన అవసరం ఉండదేమోనన్న ఉపశమన భావన బుర్రలో తళుక్కుమంది. ఇంతలో నన్ను సందిగ్ధంలో పడేస్తూ మరొకతను కూడా వచ్చేడు. అదుగో కథ అప్పుడే కాంప్లికేట్ అయిపోతోంది అని మనసులో కంగారు పడుతుండగా మొదటి శాల్తీ ఆరామ్ తో "మీ నాన్నగారితో మాట్లాడతావా?" అంటూ తన సెల్ ఫోన్ అందించేడు. ఆరామ్ ఫోను మీదుండగా - ఈ అబ్బాయి పాస్ పోర్టు ఎయిర్ లైన్స్ వాళ్ళదగ్గరే ఉందనీ, ఫ్రాంక్ ఫర్ట్ లో దిగినప్పుడు వాళ్ళే సాయం చేస్తారనీ వీళ్ళిద్దరూ మాటాడేసుకుని, తమ సెల్ ఫోను తిరిగి తీసుకుని అక్కడినుంచి కదిలి వెళ్ళేరు. వాళ్ళ సంభాషణని విన్న నాకు కంగారు పుట్టినా, ఈ కుర్రాడి తాలూకు వేలుడిచిన మేనమావో, పిన్నో ఈ విమానం మీద ఉండకపోతారా అని, ఆ సంగతి తెలుసుకోడానికి నెమ్మదిగా సంభాషణలోకి దిగా.. “ఎక్కడికి వెళుతున్నావు?" అంటూ .. ఇండియా అన్నాడు. ఇండియాలో ఎక్కడికి అంటే బొంబాయి అన్నాడు. "మరి మీ అమ్మానాన్నా?" న్యూజెర్సీలో

ఉంటారన్నాడు. "బొంబాయిలో ఎవరున్నారు?" అన్నా. "తాత అమ్మమ్మ" అన్నాడు. "నీకెన్నేళ్ళు?" అన్నా. "ఆరు" అన్నాడు. అంతే నాకు మళ్ళీ మతిపోవడం మొదలెట్టింది. స్కూల్ బస్సు ఆలస్యం అయి పిల్లలు వేళకి రాకపోతేనే తల్లితండ్రులు కంగారు పడతారే మరి ఈ పిల్లడి తల్లీ తండ్రీ వీణ్ణి ఒక్కడినీ విమానం ఎక్కించేసి అంతా సవ్యంగా జరిగిపోతుందని ఇంటికి ఏ ధైర్యంతో వెళ్ళగలిగారో నాకైతే అర్థం కాలేదు. పిల్లవాడికి తోవలో ఏదైనా అవుతే.. అన్న సంగతి అటుంచి, విమానంలో ఎక్కిన దగ్గరనుంచి పెద్దవాళ్ళే అంతసేపు ఎలా గడపాలో తోచక చిరాకు పడతారే? మరి ఈ బొడ్డూడని కుర్రాడు ఇన్ని గంటలు ఎలా కాలక్షేపం చేస్తాడో? వాడు తిన్నాడో లేదో, బాత్రూము వగైరాలకి ఎవరు సాయం చేస్తారో అన్న ఆలోచనే వాళ్ళ అమ్మానాన్నలకి కల్గలేదా? అని ఆశ్చర్యపోయాను. వాళ్ళు నా ఎదురుగా లేకపోవడంతో వాళ్ళ మీద నాకు కలిగిన చికాకుని, అసంతృప్తిని నాలో నేనే వెలిబుచ్చేసుకున్నాను. ఈ తలిదండ్రులు అజ్ఞానులూ, మతిలేనివాళ్ళు అనుకున్నా...

ఈ లోపున మళ్ళీ అడిగేడు. "దీన్ని ఎలా ఆన్ చేస్తారూ" అని "ఉండు మరి విమానం కదిలేక చేస్తారు" అన్నా... “దారి పొడుగునా వీడు నీ ప్రాణాలు తీస్తాడు సుమా” - అని నాలోని ఎర్రబట్టల ఎర్ర కొమ్ముల మనిషి చెబుతుండగా దాన్ని ఉఫ్ మని ఊదేసి మనసుని నిగ్రహించుకున్నాను. ఇంతలో విమానం కదలటం జరిగింది. ఎయిర్ హోస్టసులు ప్రయాణికులకి జాగ్రత్తలు చెప్పడం మొదలెట్టారు. హఠాత్తుగా వేలితో స్క్రీను కొట్టటం ఆపి "మాస్క్ ఎక్కడుంది?" అన్నాడు ఆరామ్, చుట్టూ వెతికేస్తూ సీటుకింద చూడబోతున్న వాడిని , అక్కడున్న వెస్ట్ పైకి లాగి ప్రయోగాలు చేస్తాడేమోనని భయపడి గభాలున ఆపేను. "లేదులే ఒక వేళ విమానంలో గాలి తగ్గుతే వాటంతట అవే మన ముందు వేల్లాడే ఏర్పాటు విమానం వాళ్ళే చేస్తా“ రన్నా.

నా పుణ్యం కొద్దీ, కొద్ది సేపట్లో చిప్సు, జ్యూసు పట్టుకొచ్చారు. అంతకంటే ముఖ్యంగా ఎంటర్ టైన్ మెంటు స్క్రీను పని చెయ్యడం మొదలయింది. మనవాడు వీరాధి వీరుడిలా గబగబా రంగప్రవేశం చేసి, ఆటలకోసం వెతికెయ్యడం ప్రారంభించాడు. నాకున్న మిడిమిడిజ్ఞానంతో వాడికి సహాయం చేసేను. ఆరామ్ చిప్సు తినేసి, నాకేసి చూడకుండానే ఖాళీ పొట్లాన్ని నాచేతిలో పెట్టేడు. వీడి స్టయిలు బంగారం గాను అనుకున్నాను. సరే నేను చదివేద్దామని తెచ్చుకున్న పుస్తకాన్నొకటి తెరిచాను. అంతే నామోచేతిని కుదుపుతూ "ఈ ఆట ఎలా ఆడతారు?" అని అడిగేడు. నాకు హఠాత్తుగా ...మా అమ్మాయి చిన్నప్పుడు "Super Mario Brothers" అనబడే ఒక విడియో గేముని నాకు నేర్పడానికి ప్రయత్నించిన సందర్భమూ, ఆ రోజున ఆరు నిముషాల్లో ఆరు వందల సార్లు ఆ మారియోగాడిని చంపేసిన నా చాకచక్యం చూసిన మా అమ్మాయి నన్ను "hope less case"గా నిర్ణయించి, ఉద్ఘాటించి మరీ చెప్పిన పీడకలలాంటి ఉదంతం గుర్తు రాగా... ఒళ్ళు జలదరించి, నీకేమైన మతి పోయిందా అన్నట్టు వాడికేసి చూసి "ఆ పని నావల్ల కాదు సుమీ. నీకు చేతనైతే ఆడుకో లేకపోతే ఆపేసి కళ్ళు మూసుకు పడుక్కో అన్నా. తరవాత మరో ఆట ఎంచుకుని ఆడటం మొదలెట్టేడు. తిండి పదార్థాలని పట్టుకుని మళ్ళీ వచ్చేరు విమానసేవకులు. ఈకుర్రాడికి ఆటలమీదే కాని తిండి మీద దృష్టి లేదు. నేనూరుకోలేక తిను లేకపోతే తరవాత ఆకలేస్తుంది అని చెంచాతో అన్నం కూరా కలిపి ముందుకి జరిపేను. కార్టూనులు చూస్తూ నోట్లోకి ఏం వెళ్ళిందో తెలియదుకాని ఒళ్ళో మాత్రం పడేసుకున్నాడు. నేను ఉండబట్టలేక పోనీ బ్రెడ్డు తిను అని కాస్త వెన్న రాసి ఇచ్చేను. నా పోరు పడలేక ఒక ముక్క కొరికి ఇంక అక్కర్లేదని పెట్టేసేడు. మధ్యాహ్నం అనగా ఇంటి దగ్గర బయలుదేరిన వీడికి ఆకలి లేదా? మరి ఏం తినడే అని బాధ పడ్డాను. నాకు ఆ తల్లి తండ్రుల మీద మళ్ళీ కోపం వచ్చేసింది. పోనీ వాడికి ఇష్టమైన సాండ్ విచ్ లాంటిది బాగులో పెట్టి పంపించవచ్చుగా అని. నాకూ తిన బుద్ధి కాలేదు. ఎయిర్ హోస్టస్ లు మిగిలిన వాటిని తీసుకెళ్ళేక తెచ్చుకున్న దుప్పటి మీద వేసుకుని కళ్ళు మూసుకున్నాను.

మరో ఐదు నిముషాల్లో నామోచేతిని మళ్ళీ కుదుపుతూ "Are we there yet?" అంటూ అడిగాడు. ఎక్కడికి అన్నా. ఫ్రాంక్ ఫర్ట్ అన్నాడు. ఇంకా 6 గంటలైనా పడుతుంది కాస్సేపు పడుక్కో అన్నా. తల అడ్డంగా ఊపేడు. మరో గంటకి కళ్ళు మూతలు పడిపోతుండగా నేను మా నాన్నకి ఫోను చేయాలన్నాడు. నాదగ్గర సెల్ ఫోను లేదు అని చెప్పేను. అది మొదలు ఐదారుసార్లు కిటికీ షట్టర్ పైకెత్తి బయటికి చూస్తూ ఫ్రాంక్ ఫర్ట్ వచ్చిందా అని అడుగుతూనే ఉన్నాడు. ఇంతలో నా పాలిటి దేవుళ్ళలాగ, జూలో జంతువులకి మేత వేళైందన్నట్టు మళ్ళీ మొదలెట్టరు వడ్డనలు. ఆరామ్ ఈసారి కూడా ఏమీ తినలేదు. నాకు ఊర్కో బుద్ధి కాలేదు. ఎయిర్ హోస్టస్ ని అడిగి చిప్స్ తెప్పిస్తే అవి మాత్రం తిన్నాడు. సరే ఇక కళ్ళు మూసుకుని పడుక్కుందాం అనుకునే లోపున ఆరామ్ ఎంటర్ టైన్ మెంట్ స్క్రీను పనిచెయ్యడం మానేసింది. నేను help button నొక్కగా నొక్కగా పదినిముషాలకి తీరిగ్గా ఒకావిడ దయచేసి ఏంకావాలని అడిగింది. చెప్పేను. దీన్ని రీబూటు చెయాలి. ఓ పది నిముషాలు పడుతుంది. అంతసేపూ దాన్ని ముట్టుకో వద్దని నిబంధన పెట్టి మరీ వెళ్ళింది. చచ్చేనురా దేవుడా అనుకున్నా... ఇక ఆ మాటా ఈ మాటా చెప్పి, నువ్వు ఏదైనా నొక్కావంటే అది పూర్తిగా పనిచెయ్యడం మానేస్తుందని బెదిరించి ఆరామ్ ని అదుపులో ఉంచా... కొంత సేపటికి దేవుని దయవల్లో విమానం వాళ్ళ చాకచక్యం వల్లో అది మళ్ళీ పనిచెయ్యడం మొదలెట్టింది. హమ్మయ్య అనుకుని మళ్లీ ఆటల్లో పడ్డ ఆకుర్రాడి ముఖం కేసి చూస్తూ ఉండిపోయాను. బాగా అలిసిపోయాడు కళ్ళు మూతలు పడిపోతున్నా ఎలాగో కళ్ళు పీక్కుని ఆడేస్తున్నాడు. నాకు మాత్రం కొంత సేపటికి నిద్రపట్టేసింది.

తెలివొచ్చేటప్పటికి ఆరాం తల వాలిపోతుండగా నా మోచెయ్యి కుదుపుతూ నీ ఒళ్ళో పడుక్కోవచ్చా అని అడిగేడు. జాలితో నాకళ్ళు చెమ్మగిల్లాయి.మా మధ్య ఉన్న కుర్చీ చెయ్యి పైకెత్తి దా పడుక్కో అన్నా.... మరో గంటన్నరకి ఫ్రాంక్ ఫర్ట్ వచ్చేసింది. ఒక ఎయిర్ హోస్టస్ వచ్చి ఆరామ్ ని లేపడానికి ప్రయత్నించింది. అప్పుడే పడుక్కున్నాడు ఎక్కడ లేస్తాడు? మొత్తానికి నేను, ఆ అమ్మాయి కలిసి అతి కష్టం మీద కళ్ళు తెరిపించాం. రాబోయే సంచికలో సీరియల్ కథ ఏ మలుపు తిరుగుతుందో అని ఆత్రుతపడే పాఠకురాలిలాగ, ఇష్టం లేకపోయినా నా బాగులు పుచ్చుకుని కదిలేను. ఫ్రాంక్ ఫర్ట్ దిగేక కాఫీ తాగి తెచ్చుకున్న పుస్తకం కాస్సేపు చదువుకుందాం అనుకున్న నా ప్లాను అంతా తల కిందై, లైనులో మూడు గంటలు నిలబడి సెక్యూరిటీ చెక్ చేయించుకుని గేటు చేరుకునేటప్పటికి పుణ్యకాలం కాస్తా ముగిసి పోయింది. అక్కడ నిలబడ్డంత సేపు ఆరామ్ మళ్ళీ నేను ఎక్కే విమానమే ఎక్కుతాడా? ఆ అబ్బాయి పక్కన సరైన వాళ్ళు కూర్చుంటారా? లాంటి ఆలోచనలు జోరీగల్లా నా మెదడంతా ముసురుకున్నాయి.

విమానం ఎక్కి మళ్ళీ సీటు వెతుక్కుంటూ నడుస్తుండగా "హాయ్ ఆంటీ" అని వినిపించింది. చూస్తే నాకంటే ముందే ఎక్కి కూర్చున్న ఆరామ్ కనబడ్డాడు. ఆ అబ్బాయిని చూడ్డానికి విమానోద్యోగులున్నారు కదా... అయినా తను సవ్యంగా సీట్లో కూర్చుని ఉండటమే కాక పక్కన మరో పదేళ్ళ కుర్రాడు ఉండటం చూసి నాకు తెలియకుండానే ఒక దీర్ఘ నిశ్వాస బయటికి వస్తుండగా హమ్మయ్య అనుకున్నాను.

నెమ్మదిగా నా సీటు చేరుకున్నాను. ఈ మారు కిటికీ దగ్గర సీటు దొరికింది. నా పక్క ఒక జంట కూర్చున్నారు. పది నిముషాల్లో విమానం బొంబాయికి బయల్దేరింది. తెచ్చుకున్న పుస్తకం తెరిచి ఒక పేజి చదివానో లేదో ఆరామ్ నామోచేతిని కుదపక పోవడం పెద్ద వెలితిగా అనిపించింది. నూవర్కులో ఎక్కినప్పుడు, ఈ చిన్న వెధవ నన్నేం విసిగిస్తాడో అన్న అనుమానంతోనూ, ఈ అబ్బాయి మూలాన్న నేను సీటు మారాల్సి వస్తుందన్న కంగారుతోను కూర్చున్న క్షణాలకీ, ఏ బాదరబందీలూ లేకుండా ఆరామ్ గా కూర్చున్న ఈ క్షణాలకీ ఎంత వ్యత్యాసం.

ఏదైనా సినిమా చూద్దామని టచ్ స్క్రీన్ మీద వేలు పెట్టబోయిన నాకు ఆరామ్ ముద్దు మొహం, వాడి చిన్నారి చెయ్యి గుర్తొచ్చి ఇక చూడాలనిపించక ఆపేసి వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను.

బొంబాయిలో విమానం దిగేక ఎవరినైనా అడిగి ఆ అబ్బాయితో ఒక ఫోటో తీయించుకుంటేనో అన్న ఆలోచన వచ్చింది. కానీ నాకంటే బోలెడు ముందు కూర్చున్న ఆరామ్ నేను దిగేక కనబడడేమో. కొన్ని కొన్ని అనుభవాలు తియ్యటి జ్ఞాపకాలుగానే మిగిలిపోవటంలోనే అందముందనిపించింది. అయినా ఫోటో ఎందుకు ముద్దొచ్చే ఆ ముఖం వెనకాల నా మనసెప్పుడు పరుగులు పెడుతూనే ఉంటుంది అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.